అదును దాటుతోంది..!

- దుక్కులు సిద్ధం చేసిన రైతులు
- ముందుగానే విత్తనాలు, ఎరువుల కొనుగోలు
- చినుకు కోసం ఎదురుచూపులు
- సమయం మించిపోతోందని ఆందోళన


చినుకు లేక దుక్కులు చేస్తుండగా లేస్తున్న దుమ్ము..

గుండాల: తొలకరి జల్లులు కురవగానే దుక్కులు చేసిన గిరిజన పల్లెల్లో ఆచార సాంప్రదాయ పద్ధతిలో విత్తనపు పండగలు చేశారు. సమృద్ధిగా వానలు కురవాలని.. పంటలు పండాలని వణరుడిని, గ్రామ, వన దేవతలను మొక్కుకున్నారు. కానీ ఖరీఫ్ సీజన్ ఆరంభమై ఇరవై రోజులు గడుస్తున్నా.. చినుకు జాడ కానరావడం లేదు. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

వేసవిలోనే మొదలైన దుక్కులు..

ఖరీఫ్ ప్రారంభానికి ముందే వర్షాలు పడడంతో ఈ సారి అప్పటికే రైతులు వేసవి దుక్కులు చేశారు.

బోరు బావులపైనా ఆశ లేదు..

ప్రతి ఏటా వర్షంపై ఆధార పడే రైతులు ఈ సారి బోరుబావులు వందల సంఖ్యలో తీయించారు. దీంతో సాగు విస్తీర్ణం పెరిగింది. ఆళ్లపల్లి, గుండాల మండలాల్లో సుమారు 50 వేల ఎకరాల్లో మొక్కజొన్న, 30వేల ఎకరాల్లో పత్తి, 10 వేల ఎకరాల్లో వరి, మరో 5వేల ఎకరాల్లో ఇతర పంటలను సాగు చేయనున్నారు. అయితే, బోరుబావులు పెరిగినందున భూగర్భ జలాలు సైతం అడుగంటిపోయాయి. దీంతో బోరుబావులు ఉన్నా ఉపయోగం లేనట్లైంది. మరలా వర్షంపైనే ఆధారపడే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో వర్షాలు సన్నగిల్లడం రైతులకు సవాళుగా మారింది.

మొక్కజొన్న, పత్తి సాగు చేసేందుకు అచ్చులు వేసి ఉంచారు. కానీ ఖరీఫ్ సీజన్ ప్రారంభమై చాలా రోజులు గడుస్తున్నా చినుకు జాడ లేదు. వేసవిలో దంచికొట్టిన వానలు.. వర్షాకాలంలో మొహం తిప్పుకున్నాయి. ప్రస్తుతం వర్షం పడడమే ఆలస్యమన్నట్లుగా విత్తేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు.

రెడీగా విత్తనాలు, ఎరువులు

ప్రతి ఏడాది ఎరువులు, విత్తనాలు అదునుదాటక ముందే వేయాలని చూసే రైతులు ఈ సారి ముందస్తుగానే సరిపడా ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసి నిలువ ఉంచుకున్నారు. ఈ సారి యూరియా కొరత ఉంటుందనే ప్రచారంతో రైతులు ఆందోళన చెందుతూ దుకాణాల వద్ద, సొసైటీల వద్ద బారులుదీరారు. దూరప్రాంతాల నుంచి వచ్చి ఒకేసారి సరిపడా విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసుకున్నారు. కానీ వర్షం మాత్రం రాకపాయె.

సమయం మించిపోతోంది..



ఈ రోజు కాకపోతే రేపైనా వర్షం వస్తే విత్తనాలు నాటుదామని దుక్కులు చేశాం. భూమిలో చుక్క తడిలేక దుక్కులు చేస్తుండగానే దుమ్ము లేస్తోంది. ఖరీఫ్ ప్రారంభంలోనే తొలకరి జల్లులకు విత్తనాలు నాటుదామని ఆశించాం. కానీ రోజురోజుకు సమయం మించిపోతోంది.

– మాలోత్ శ్రీను, రైతు, సర్సాపురం

రేపటి మీద ఆశతో..



పత్తి, మొక్కజొన్న విత్తనాలు తీసుకువచ్చి నాటేందుకు సిద్ధంగా ఉన్నాం. కానీ వాన దేవుడు పగబట్టినట్లుగా ఉన్నాడు. మబ్బులు కమ్ముతూ ఆశలు రేపుతున్నాడు కానీ చినుకుజాడ లేదు. ఈ రోజు కాకపోతే రేపైనా వస్తుందనే ఆశతో ఎదుచూస్తూ ఉన్నాం.

– కల్తి నర్సయ్య, రైతు, లక్ష్మీపురం

ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు పంపిణీ


అశ్వాపురం: ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్వర్లు

అశ్వాపురం: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ముత్యాలరావు అధ్యక్షతన మంగళవారం జరిగిన కార్యక్రమంలో మండలంలోని 23 గ్రామ పంచాయతీలకు చెందిన 481 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే పాయం ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ.. పైలట్ ప్రాజెక్ట్‌గా తుమ్మలచెరువులో రూ.12.5 కోట్లతో 250 ఇళ్లు, మండలంలో 23 గ్రామ పంచాయతీలలో రూ.24.05 కోట్లతో 481 ఇళ్లు కలిపి.. మొత్తం మండలంలో 731 ఇళ్లు మంజూరు అయినట్లు తెలిపారు. మరోవైపు, గొందిగూడెంలో ఇసుకవాగుపై రూ.7కోట్లతో నిర్మించిన హైలెవల్ వంతెనను, ఇరువైపులా నిర్మించిన రహదారిని ఆయన ప్రారంభించారు. గొందిగూడెం ఆశ్రమ పాఠశాలలో రూ.1.80 కోట్లతో నిర్మించనున్న అదనపు తరగతి గదులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఇళ్ల పంపిణీ కార్యక్రమంలో తహసీల్దార్ రాజారావు, సీఐ అశోక్‌రెడ్డి, యూడీసీ పద్మావతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కిషోర్, ఏపీఓ సీతారామయ్య, ఏపీఎం సత్యనారాయణ, నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు షర్ఫియుద్దీన్, ఎస్‌కే ఖదీర్, మాజీ ఎంపీపీ ఊసా అనిల్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు..

మణుగూరుటౌన్: స్థానిక ప్రజాభవన్‌లో లబ్ధిదారులకు రూ.2.30 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గురువారం అందజేశారు. మరోవైపు, మండలంలోని విప్పలసింగారం గ్రామంలో ఎమ్మెల్యే పాయం ఇందిరమ్మ ఇంటికి భూమి పూజ చేశారు. అనంతరం రూ.30లక్షల విలువైన సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నరేశ్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, మండల నాయకులు నవీన్, శివ, యూత్ నాయకులు తరుణ్‌రెడ్డి, చైతన్య, స్థానిక నాయకులు గోరంట్ల కనకయ్య ఉన్నారు.

ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించాలి


కరకగూడెం: వలస ఆదివాసీలతో సీఐ వెంకటేశ్వరరావు, సిబ్బంది

కరకగూడెం: వలస ఆదివాసీలు ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించాలని ఏడూళ్ల బయ్యారం సీఐ వెంకటేశ్వర రావు సూచించారు. గురువారం 'పోలీస్ కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాం'లో భాగంగా ఆయన మండలంలోని నిమ్మగూడెం, నీలాద్రిపేట గండి గొత్తికోయ గ్రామాలను సందర్శించి యువతకు వాలీబాల్ కిట్లు, పిల్లలకు పలకలు పంపిణీ చేశారు. ఆదివాసీ ప్రజలు మావోయిస్టులకు ఎట్టి పరిస్థితుల్లో సహకరించవద్దని, అనవసరంగా కేసులు, జైలు పాలు కావద్దని సూచించారు. కార్యక్రమంలో కరకగూడెం ఎస్ఐ పీవీఎన్ రావు, స్పెషల్ పార్టీ టీజీఎస్పీ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలో క్రీడాపోటీలు


పరుగు పందెంలో పాల్గొన్న విద్యార్థులు

దమ్మపేట: క్రీడా పాఠశాలల్లో ప్రవేశం కోసం నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీల్లో మండలంలోని రంగువారిగూడెం ప్రాథమిక పాఠశాలకు చెందిన 4వ తరగతి విద్యార్థి లోకేష్ జిల్లా స్థాయికి ఎంపికయ్యాడు. గురువారం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకులంలో నిర్వహించిన ఈ పోటీల్లో.. రంగువారిగూడెంకు చెందిన విద్యార్థి లోకేష్ అత్యుత్తమ ప్రతిభ చూపి, జిల్లాకు ఎంపికకాగా ఎంఈఓ కీసర లక్ష్మి అతడిని అభినందించారు. ఈ నెల 23 నుండి 26 వరకు జిల్లా కేంద్రంలో జరగనున్న జిల్లా స్థాయి ప్రతిభ పోటీలకు ఆ విద్యార్థి హాజరుకానున్నాడని ఎంఈఓ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాలల హెచ్ఎంలు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు

కాంగ్రెస్ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని ప్రజాప్రతినిధులు, నాయకుల ఆధ్వర్యంలో కేక్‌లు కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. రాహుల్ గాంధీ కలకాలం ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుతూ.. జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. రాబోయే ఎన్నికల్లో దేశ ప్రజల సంపూర్ణ మద్దతుతో రాహుల్ ప్రధాని పదవిని చేపట్టడం ఖాయమని ఈ సందర్భంగా పార్టీ బాధ్యులు ఆశాభావం వ్యక్తం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


మణుగూరుటౌన్: పార్టీ శ్రేణులకు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు


దమ్మపేట: కాంగ్రెస్ నాయకులతో కలసి కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ


దుమ్ముగూడెం: స్కూల్ విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేస్తున్న పొదెం వీరయ్య

బీసీ డిగ్రీ గురుకులంలో స్పాట్ అడ్మిషన్లు

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలో ఉన్న బీసీ డిగ్రీ గురుకుల కళాశాలలో ఈ నెల 24వ తేదీలోపు స్పాట్ అడ్మిషన్స్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్‌కె.బురాన్ గురువారం ఒకప్రకటనలో తెలిపారు. ప్రథమ సంవత్సరంలో స్పాట్ కౌన్సిలింగ్ చేపట్టినట్లు తెలిపారు. బీఎస్సీ (ఎంపీసీఎస్, ఎంపీసీ, బీజెడ్‌సీ), బీకాం (కంప్యూటర్ అప్లికేషన్స్), బీఏ గ్రూపుల్లో ఖాళీలు ఉన్నట్లు వివరించారు.

మారిన విద్యుత్ శాఖ అధికారుల ఫోన్ నంబర్లు

చంద్రుగొండ: విద్యుత్ శాఖాధికారుల ఫోన్ నంబర్లు మారినట్లు ఏఈ ఎంఎల్ నర్సింహారావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బీఎస్ఎన్ఎల్ నుంచి ఏయిర్‌టెల్‌కు కొత్త నెంబర్లు కేటాయించినట్లు వివరించారు. ఏఈ–8712485910, సీనియర్ లైన్‌ఇన్స్‌పెక్టర్ –8712485911, లైన్ ఇన్స్‌పెక్టర్–8712485912, లైన్‌మెన్–8712485913, చంద్రుగొండ విద్యుత్ సబ్‌స్టేషన్–8712485914, పోకలగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్ –8712485916, మద్దుకూరు విద్యుత్ సబ్‌స్టేషన్– 8712485915 నంబర్లను కేటాయించినట్లు తెలిపారు. విద్యుత్ సమస్యలు, విద్యుత్ అంతరాయాలు, ఇతర సేవలకు ఈ నంబర్లకు సంప్రదించాలని ఏఈ కోరారు.

రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తు చేసుకోండి

అశ్వారావుపేటరూరల్: భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులను రైతులు దరఖాస్తులు చేసుకోవాలని స్థానిక తహసీల్దార్ సీహెచ్‌వీ రామకృష్ణ కోరారు. గురువారం మండలంలోని కావడిగుండ్ల, పాత అల్లిగూడెంలో సదస్సులు నిర్వహించగా.. ఆయా సదస్సుల్లో మొత్తం 192 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమాల్లో డిప్యూటీ తహసీల్దార్ హుస్సేన్, ఆర్ఐలు కృష్ణ, పద్మావతి, కార్యదర్శి మోతీలాల్, సిబ్బంది చైతన్య, రమేష్ పాల్గొన్నారు.

మాలమహానాడు డివిజన్ అధ్యక్షుడిగా కార్తీక్

భద్రాచలంటౌన్: భద్రాచలం డివిజన్ మాలమహానాడు అధ్యక్షుడిగా కార్తీక్‌ను నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడి పాల్‌రాజ్ గురువారం పట్టణంలోని ఏఎంసీ కాలనీలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయనకు నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో రామకృష్ణ, శ్యామ్, కనకరాజు, ఏసు, శాంతి, రాజు, దర్శన్, బాబు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పరిరక్షించాలి

భద్రాచలంటౌన్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని, పచ్చదనంతో పర్యావరణ పరిరక్షణ కోసం పాటు పడాలని ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్ సూచించారు. పట్టణంలో గ్రీన్ భద్రాద్రి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమంలో గురువారం ఆయన పాల్గొన్నారు. మొక్కలు నాటి మాట్లాడారు. గ్రీన్ భద్రాద్రి వారు మొక్కలు నాటడాన్ని అభినందనీయమన్నారు. అనంతరం కూనవరం రోడ్డులో నూతనంగా నిర్మించిన మోడ్రన్ పబ్లిక్ టాయిలెట్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. పంచాయతీ ఈఓ శ్రీనివాస్, గ్రీన్ భద్రాద్రి సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విస్తృత పర్యటన


మండలపల్లిలో విద్యార్థులతో కలిసి ఒలంపిక్ రన్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే జారె

దమ్మపేట: మండలంలో గురువారం విస్తృతంగా పర్యటించిన స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండలపల్లి గ్రామంలో సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థులతో నిర్వహించిన ఒలంపిక్ 2కే రన్‌లో ఎమ్మెల్యే జారే పాల్గొన్నారు. అదే గ్రామంలో అక్కినేని కార్ గ్యారేజ్‌ను ఎమ్మెల్యే చేతులమీదుగా ప్రారంభించారు. అనంతరం బ్రైట్ ఫౌండేషన్ హైదరాబాద్ వారి ఆర్థిక సహకారంతో గండుగులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆట వస్తువులు, కంప్యూటర్లను ఎమ్మెల్యే ఆధ్వర్యంలో వితరణగా అందజేశారు. కంప్యూటర్లను విద్యార్థులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఎస్సై సాయి కిషోర్ రెడ్డి మాట్లాడుతూ... హెయిర్ కటింగ్, డ్రస్సింగ్ తదితర అంశాల్లో విద్యార్థులు పలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కాంగ్రెస్ నాయకులు పర్వతనేని ప్రసాద్, చిన్నశెట్టి యుగంధర్, ఎంఈఓ కీసర లక్ష్మి, ప్రిన్సిపాల్స్ వెంటేశ్వర్లు, వీరాస్వామి, హెచ్ఎం మస్తాన్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

దుకాణదారులకు అవగాహన


మండలపల్లిలో దుకాణదారులతో మాట్లాడుతున్న సీఐ నాగరాజు

దమ్మపేట: మండలంలోని మండలపల్లి ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న దుకాణాదారులకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గురువారం రోడ్డు భద్రత ప్రమాణాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అశ్వారావుపేట సీఐ నాగరాజు మాట్లాడుతూ.. రహదారికి నిర్ణీత దూరంలోనే దుకాణాలను ఏర్పాటు చేసుకుని, రోడ్డు ప్రమాదాల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. గంజాయి వంటి మత్తు పదార్థాలను విక్రయించినా, సేవించిన చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దమ్మపేట ఎస్సై సాయికిషోర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సికిల్ సెల్ రహిత సమాజానికి కృషి


సికిల్ సెల్ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ నిశాంత్‌రావు

మణుగూరురూరల్: సికిల్ సెల్ రహిత సమాజం కోసం పాటుపడాలని మణుగూరు పీహెచ్‌సీ డాక్టర్ నిశాంత్‌రావు అన్నారు. ప్రపంచ సికిల్ సెల్ దినోత్సవాన్ని మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. సికిల్ సెల్ వ్యాధి లక్షణాలు వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నిశాంత్‌రావు మాట్లాడుతూ.. సికిల్‌సెల్ అంటువ్యాధి కాదని, ఆహార అలవాట్ల ద్వారా సంభవించదని తెలిపారు. తల్లిదండ్రుల నుంచి మాత్రమే ఈ వ్యాధి సంక్రమిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సునీల్, సూపర్‌వైజర్లు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

పూర్వ విద్యార్థుల వితరణ

అశ్వారావుపేటరూరల్: మండలంలోని ఆసుపాక గ్రామం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో 155 మంది విద్యార్థులకు అదే పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు సంకా ప్రసాద్, ఆజ్మీర వెంకటేశ్వరరావు, యర్రంశెట్టి రమేష్, నల్లపు రామారావు తోపాటు మరికొంత గ్రామస్తులు కలిసి రూ.50వేల విలువైన స్కూల్ బ్యాగులు, టై, బూట్లు, బెల్టులు గురువారం వితరణగా అందించారు. వీటిని ఎంఈఓ పొన్నగంటి ప్రసాద్‌రావు చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. దాతలను అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుససోతు లింగయ్య, హెచ్ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ములకలపల్లి: గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఏదులాపురం గోపాలరావు, సహాయ కార్యదర్శి నూపా భాస్కర్ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం ఎంపీడీఓ గద్దె రేవతికి వినతిపత్రం అందజేశారు. సంఘ మండల కమిటీ బాధ్యులు కొంద్రు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గోదావరి ముంపుపై ఉద్యమించాలి

బూర్గంపాడు: గోదావరి వరద ముంపుపై స్థానికులు చైతన్యవంతమై ప్రజాప్రతినిధులు, అధికారులపై ఒత్తిడి తీసుకురావాలని సీపీఐ (ఎంఎల్) డివిజన్ నాయకుడు పున్నంచంద్ కోరారు. గురువారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ప్రతి ఏటా గోదావరి వరద ముంపుతో భద్రాచలం రెవెన్యూ డివిజన్ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న పాలకులు పట్టించుకోవటం లేదని ఆరోపించారు. ఊరువాడ పూర్తిగా మునగక ముందే స్థానికులు తమ ప్రత్యామ్నాయం కోసం పాలకులపై ఒత్తిడి పెంచాలని సూచించారు.

23న ధర్నా

మణుగూరురూరల్: కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ నెల 23వ తేదీన అన్ని గ్రామపంచాయతీ కార్యాలయాల ఎదుట నిర్వహించే ధర్నా కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు గురువారం సోషల్ మీడియా వేదికగా కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అర్హత కలిగిన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని, గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

గ్రామసమాఖ్యలకు శిక్షణ

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): మండలంలో నూతనంగా ఎన్నికైన గ్రామసమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులకు సాయిబాలాజీ మండల సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం ఒక రోజుపాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సీనియర్ సీఆర్‌పీలు ఎస్.రమాదేవి, వి.రమ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీఎం ఎండి.మీరాబీ, మండల సమాఖ్య అధ్యక్షురాలు యం.సీత, సీసీలు శ్రావణి, జ్యోతి పాల్గొన్నారు.

'వంతెనలు మంజూరు చేయించింది రేగానే'

అశ్వాపురం: మండల పరిధిలోని గొందిగూడెంలో ఇసుకవాగు, తుమ్మలచెరువులో లోతువాగులపై వంతెన నిర్మాణాలు మంజూరు చేయించి ఆదివాసీ ప్రజల కల నెరవేర్చిన ఘనత మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుకే దక్కుతుందని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ అన్నారు. అశ్వాపురంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆయా నిర్మాణాలకు మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ప్రత్యేక చొరవతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, మాజీ మంత్రి పువ్వాడ చేత శంకుస్థాపన చేయించిందని తెలిపారు. ఈ నిర్మాణాల విషయంలో ప్రస్తుతం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తీరు పాత గోడలకు కొత్తం సున్నం వేస్తున్నట్టుగా ఉందన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

దమ్మపేట: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. మండల విద్యా వనరుల కేంద్రం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు పిట్టల అర్జున్ మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10 వేల వేతనం చెల్లించి, పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పెరిగిన నిత్యావసరాల ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలను పెంచి, బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులను కేటాయించాలన్నారు. కార్యక్రమంలో రాజ్యలక్ష్మి, వెంకటమ్మ, లక్ష్మి, పాపమ్మ, బాలనాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఒకటి నేల చూపు.. ఇంకోటి ఆకాశం వైపు!


తిరుమలకుంట ఆలయం వద్ద నేల చూపు చూస్తున్న సీసీ కెమెరా


పాలకగూడెం మార్గంలో పైకి తిరిగిన మరో నిఘా నేత్రం

అశ్వారావుపేటరూరల్: గ్రామీణ ప్రాంతాల్లో దాతల సహకారంతో కొంతకాలం క్రితం పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నిరుపయోగంగా మారాయి. అశ్వారావుపేట మండలంలోని తిరుమలకుంట గ్రామంలో ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఆలయం వద్ద, అలాగే ఇదే గ్రామంలోని పాకలగూడెం వెళ్లే మార్గంలో మరో రెండు సీసీ కెమెరాలను అమర్చారు. కాగా, ఈ నిఘా నేత్రాలు కొద్ది కాలం బాగానే పని చేయగా.. ఆ తర్వాత నిర్వహణ గాలికి వదిలేయడంతో ఒక కెమెరా నేల చూపు చూస్తుండగా, మరో రెండు కెమెరాల్లో ఒకటి ఆకాశం వైపు చూస్తోంది. దీంతో తమ గ్రామంలో నిఘా నేత్రాలు ఉన్నా ఫలితం లేకుండా పోతోందని గ్రామస్తులు వాపోతున్నారు. పోలీస్ శాఖ అధికారులు సీసీ కెమెరాలపై దృష్టి సారించి, వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

విధుల్లో నిర్లక్ష్యంపై ఫిర్యాదు

దమ్మపేట: మండల కేంద్రంలోని పోస్టాఫీస్ ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. సరైన సమయపాలన పాటించకపోవడంతోపాటు కార్యాలయానికి వచ్చిన వ్యక్తుల పట్ల అనుచితంగా వ్యవహరిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. గురువారం రెవెన్యూ స్టాంపుల కోసం పోస్టాఫీస్‌కు వెళ్లిన ఓ వ్యక్తి పట్ల ఆ శాఖ ఉద్యోగులు దురుసుగా ప్రవర్తించారని.. ఆవ్యక్తి ఆరోపిస్తున్నాడు. స్టాంపులు కావాలని అడగగా 20 నిమిషాల పాటు వేచి ఉండాలని పొంతన లేని సమాధానం ఇచ్చినట్లు బాధితుడు వాపోయాడు. 20 నిమిషాల తరువాత కూడా స్టాంపులు ఇవ్వకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన అనంతరమే స్టాంపులను ఇచ్చినట్లు చెబుతున్నాడు. ఈ ఉదంతంపై అతడు పోస్టల్ శాఖ జిల్లా ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

యుద్ధం ఆపాలని వామపక్ష పార్టీల నిరసన

భద్రాచలంటౌన్: సామ్రాజ్యవాద దేశం అమెరికా అండతో ఇజ్రాయిల్ పాలస్తీనా, ఇరాన్‌లపై వైమానిక దాడులకు పాల్పడుతోందని, దీనిని తీవ్రంగా ఖండించాలని వామపక్ష పార్టీలు అన్నాయి. గురువారం పట్టణంలోని అమరవీరుల స్తూపాల వద్ద పాలస్తీనాకు సంఘీభావంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వామపక్ష పార్టీ నాయకులు మాట్లాడారు. యుద్ధం వద్దు–శాంతి ముద్దు అంటూ నినాదాలు చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎంబీ నర్సారెడ్డి, పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, బండారు శరత్ బాబు, లక్ష్మి, సీపీఐ పట్టణ కార్యదర్శి మారెడ్డి శివాజీ, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ నాయకులు కెచ్చల కల్పన, నాదెళ్ల లీలావతి, జ్యోతి, నాగరాజు, శ్రీనివాస్, జీవనజ్యోతి, అజయ్ కుమార్, శ్రీనివాస్, భూపేంద్ర, కనక శ్రీ, శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

బూర్గంపాడు: సీపీఐ మండల మహాసభల సందర్భంగా గురువారం సారపాకలో జరిగిన సమావేశంలో పార్టీ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శిగా సప్కా నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శులు పాండవుల బిక్షం, ముదిగొండ బాలకృష్ణలను ఎన్నుకున్నారు. వీరితో పాటుగా 18మంది కార్యవర్గ సభ్యులను, 40మంది కౌన్సిల్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు ముప్వ వెంకటేశ్వరరావు, పేరాల శ్రీనివాసరావు, అలవాల సీతారామిరెడ్డి, సుబ్బారెడ్డి, బర్ల వెంకటేశ్వర్లు, లోకిరెడ్డి శంకర్ రెడ్డి, వంకాయలపాటి నాగేశ్వరరావు, బలరామ్, పిచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాబా ఆలయానికి విరాళం

పినపాక: మండలంలోని ఈ బయ్యారం గ్రామంలో ఉన్న సాయిబాబా ఆలయానికి గురువారం విరాళం అందజేశారు. అదే గ్రామానికి చెందిన ఉడుముల పద్మజ, కంది జయ భారత్ రెడ్డి, రమణారెడ్డి, ఎన్నారైలు స్నేహాలు సంయుక్త ఆలయ అభివృద్ధికి 50వేలను విరాళంగా అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులకు నగదు అందజేశారు. కార్యక్రమంలో కొండా తిరుపతిరెడ్డి, చిత్తూరు సత్తిబాబు, రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం..

మణుగూరురూరల్: మండలంలోని సమితిసింగారం గ్రామపంచాయతీ సాయినగర్‌లోని శ్రీషిర్డీ సాయిబాబా ఆలయంలో మణుగూరుకు చెందిన కటుకూరి శ్రీనివాసరెడ్డి–భాగ్యలక్ష్మి దంపతులు, వారి కుమారుడు సురేందర్‌రెడ్డిలు, ఎస్.వెంకయ్యనాయకుడు–నర్మద దంపతులు, వారి కుమారుడు రాహుల్, కుమార్తె సింధులు గురువారం అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం అన్నదాతలను ఆలయకమిటీ సభ్యులు శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దోసపాటి నాగేశ్వరరావు, సీహెచ్ బాలకేశవరావు, అర్చకులు పవన్ కుమార్ వర్మ, గుమస్తా వెంకన్న, సాయి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

దమ్మపేట: మండలంలో పర్యటించిన బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు గురువారం పలు కుటుంబాలను పరామర్శించారు. దమ్మపేటలో ఇటీవలే మృతి చెందిన తుపాకుల గోపి, దండు శ్రీను చిత్రపటాలకు పూలతో నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో నాయకులు దారా మల్లిఖార్జునరావు, జిన్నా, యేసుబాబు, రూపా రాంబాబు, శ్రీను, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు చందా సతీష్(53) ఈ నెల 11న గుండెపోటుతో మృతి చెందగా.. ఆ కుటుంబాన్ని గురువారం అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాల చేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ నిర్మల పుల్లారావు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు చందా లక్ష్మీనర్సయ్య, జక్కుల రాంబాబు, చందా కుమార స్వామి, కాటూరి నాగేశ్వరరావు, పసుపులేటి శివ, సూరిబాబు, పెద్ద దుర్గారావు పాల్గొన్నారు.